జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 11-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 641 పేజీలు: 4 వెల: రూ.7



* వర్షాలకు వందల ఎకరాల్లో పాడైన టమాటా పంట
* పరిశీలనకే పరిమితమైన అధికారులు
* పట్టించుకోని ప్రజాప్రతినిధులు
* లబోదిబోమంటున్న రైతులు
* పంట పాడుకావడంతో పశువుల మేతకు వదిలేసిన రైతులు

# టమారా

**సోంపేట, ఏప్రిల్ 10(వార్త):** సోంపేట మండలంలో ఎన్నడూ లేని విధంగా వందలాది ఎకరాల్లో టమాటా సాగు చేసిన రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఒక్కొక్కరు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట వేశారు. చేతికొచ్చిన సమయంలో అకస్మాత్తుగా కురిసిన వడగండ్ల వాన రైతన్నలకు కడగండ్లు మిగిల్చింది. కొనుగోలు చేసే వ్యాపారులు లేక పండిన పంటను చేతులారా పశువులకు మేతగా వదిలేశారు. జింకిభద్ర, బెంకిలి, పలాసపురం, బారువ గ్రామాల పరిధిలో సుమారు 600 ఎకరాలలో ఈ ఏడాది రైతులు టమాట సాగును చేపట్టారు. నాలుగు రోజుల క్రితం ఆకస్మికంగా వచ్చిన భారీ ఈదురు గాలులతోపాటు వడగండ్ల వాన రైతులు ఆశలపై నీళ్లు చల్లింది. ఇదే గ్రామాల పరిధిలో వడగండ్ల వాన కురియడంతో పంట పనికిరాకుండా పాడైంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతన్నలు కాస్తో కూస్తో లాభాలు పొందుదామని ఆశించినప్పటికీ వారి ఆశలు అడియాసలు అయ్యాయి.



## కానరాని ప్రజాప్రతినిధులు..

అకాల వర్షాలకు టమాటా పండ పాడై నష్టాల బాట పట్టిన రైతులకు పట్టించుకున్న వారు కరువయ్యారు. వ్యవసాయాధికారులు పాడైన పంటను చూసి వెళ్లిపోయారు. ప్రజాప్రతినిధులు కనీసం ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో వారంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ గాని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గాని పంట నష్టంపై ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## పంట నమోదు చేయండి..

నష్టపోయిన ప్రతి రైతు వ్యవసాయ శాఖ లేదా ఉద్యాన శాఖ అధికారుల వద్ద తమ తమ పంటలను తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోరుతున్నారు. 33శాతం కన్నా మించి నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం తప్పనిసరిగా బాధిత రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఎవరూ అశ్రద్ధ చేయకుండా పంట నమోదుకు కృషి చేయాలని కోరారు.



* సూదికొండలో దళిత మహిళ గూడు నేలమట్టం
* న్యాయం కోసం కన్నీటి పోరాటం
* కలల సౌధం నేలమట్టం కావడం మనస్థాపానికి గుర్రై ఆత్మహత్యాయత్నం
* ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

# పేదింటిపై.. బుల్డోజర్!






పలాస, ఏప్రిల్ 10 (వార్త): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండలో ఇల్లు కూల్చివేత ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. సర్వే నంబర్ 49లో, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వెనుకభాగంలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో నిరుపేద దళిత మహిళ కింతాడ దేవి కాయ కష్టం చేసి పైసా పైసా కూడబెట్టి, కొంతవరకు అప్పుచేసి గూడు కట్టుకునే ప్రయత్నం చేసింది. ఈ నిర్మాణాన్ని అక్రమమంటూ ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేయడంతో మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు పలుమార్లు అక్కడికి చేరుకుని పనులను ఆపాలని ఆదేశించారు. ప్రతి సారి ఆమె వేడుకున్నా, కొంతకాలం వెనుదిరిగిన అధికారులు చివరికి కఠిన నిర్ణయం తీసుకున్నారు. పోలీసుల భద్రత నడుమ రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది జేసీబీతో అక్కడికి చేరుకుని నిర్మాణాన్ని కూల్చివేశారు. తాను తెచ్చిన పత్రాలు చూపిస్తానని, కనీసం పునాదిని కూల్చొద్దని కన్నీళ్లు పెట్టుకుని వేడుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. భర్త లేని ఒంటరి మహిళగా, అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారిని పోషిస్తూ కూలి నాలి చేసి జీవనం సాగిస్తున్న తాను ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలంటూ కింతాడ దేవి లబోదిబోమంటోంది. సుమారు ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు చేసి కట్టుకున్న గూడు క్షణాల్లో నేలపాలు కావడంతో ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమైంది. 'పలాసలో డబ్బున్న పెద్దోళ్లు భూములు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు... వాళ్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? పేదలంటే అంత చులకనా?" అంటూ బాధితురాలు అధికారులను నిలదీసింది. ఈ నేపథ్యంలో దళిత సంఘాలు బాధితురాలికి అండగా నిలుస్తూ, ఆమెకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కలల సౌధం కావడంతో మనస్థాపానికి గుర్రై శుక్రవారం ఆమె ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. స్థానికులు గమనించి తక్షణమే పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# శ్రీకాకుళం.. ఎదుగుతున్న జిల్లా

* 18 నెలలుగా రూ.50 కోట్లు వినియోగం
* సిఎస్ఆర్ ఏక్టివిటీ చారిటీకే కాదు.. అభివృద్ధికి దోహదం
* కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్
* కొత్తరోడ్డులో సిఎస్ఆర్ సమ్మిట్ విజయవంతం
* తరలివచ్చిన ఎమ్మెల్యేలు, ఎన్జీవోలు, కార్పొరేట్ సంస్థలు



**శ్రీకాకుళం, ఏప్రిల్ 10(వార్త):** శ్రీకాకుళం జిల్లా ఎదుగుతున్న జిల్లాగా మారుతోందని, ఇతర ప్రాంతాల వారు మన జిల్లాకు త్వరలో వలసలు వస్తారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కొత్త రోడ్డు వద్ద గల శాంతి కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం సీఎస్ఆర్ సమ్మిట్ నిర్వహించారు. తొలుత కేంద్ర మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ సిఎస్ఆర్ వినియోగంలో ప్రపంచంలో భారత్ మొదటి స్థానంలో ఉంటుందన్నారు. భారత దేశం సాంస్కృతిక మూలాలు చూసుకుంటే మన సంపాదనలో సమాజానికి ఎంత ఇవ్వగలం అనే దానిని నిర్ణయించుకోవాలన్నారు. దేశంలో పెద్ద పెద్ద కంపెనీలు పెరగడం వలన కంట్రిబ్యూషన్ కూడా పెరిగిందన్నారు. ఏదైనా ప్రాంతంలో పరిశ్రమ పెట్టాలంటే ప్రజాభిప్రాయ సేకరణ చేసిన తరువాత పరిశ్రమ ఏర్పాటు చేసి దాని నుండి వచ్చిన కంట్రిబ్యూషన్ ఆ ప్రాంతం అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. సిఎస్ఆర్ పెట్టిన తర్వాత 2014లో ప్రధాని నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత మరింత ఫండ్స్ వచ్చేటట్లు చేసి ఎన్నో సేవలు చేసినట్లు చెప్పారు. సిఎస్ఆర్ ఏక్టివిటీ చారిటీకే కాదని, అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడుతోందన్నారు. సిఎస్ఆర్ ఏక్టివిటీ శ్రీకాకుళంలో పెద్ద ఎత్తున చేయవచ్చున్నారు. సిఎస్ఆర్ ఏక్టివిటీలో పెద్ద పెద్ద కంపెనీలకు ఫండ్స్ అయితే ఉన్నాయి కానీ ఏ విధంగా చేస్తే బాగుంటుంది అనే అవగాహన లేనందు వలన వారు ఏమి చేయలేకపోతున్నారన్నారు. కార్పొరేట్ నుండి నిధులు వచ్చిన రాకపోయిన ఎన్జీఓలు సర్వీసు చేస్తున్నారన్నారు. ఎన్జీఓ కోసం ఒక ప్లాట్ ఫారం ఏర్పాటు చేయాలన్నారు. శ్రీకాకుళం అవకాశం ఉన్న జిల్లా అని తెలిపారు. మొదటి సమ్మిట్ చెన్నై, రెండవది హైదరాబాద్, మూడవది శ్రీకాకుళంలో ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. జిల్లాలో ప్రత్యేక సిఎస్ఆర్ సెల్ ఉందన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఈ సమావేశానికి 30 కార్పొరేట్, 50 ఎన్జీఓ టీంలు పాల్గొన్నాయన్నారు. జిల్లాలో అభివృద్ధి చేయుటకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో సిఎస్ఆర్ సెల్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పి.4 ను ప్రారంభించారని, సంపాదించిన సంపాదనలో కొంత శాతం వెచ్చించి వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక పెట్టుబడులకు అత్యుత్తమ ప్రాంతమని, శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు ముందుకురావాలని కోరారు. త్వరలో పూర్తికానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వల్ల రవాణా సదుపాయాలు మరింత మెరుగుపడతాయని వివరించారు. జిల్లాలో ఇప్పటికే ఉన్న నేషనల్ హైవేలు పరిశ్రమల రవాణాకు ఎంతో దోహదపడతాయన్నారు. పరిశ్రమల కోసం అవసరమైన నీటి వనరులు వంశధార, నాగావళి నదులు జిల్లాలో విస్తారంగా అందుబాటులో ఉన్నట్లు వివరించారు. శ్రీకాకుళం జిల్లాను పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకురావాలన్నారు. శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి అభివృద్ధి చేయాలన్నారు. నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ సిఎస్ఆర్ ఏక్టవిటి ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వాలన్నారు. పాతపట్నం శాసన సభ్యులు మామిడి గోవిందరావు మాట్లాడుతూ సంపాదనలో రెండు శాతం అభివృద్ధికి వినియోగించాలని కోరారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వివిధ ఎన్జీవో, కార్పొరేట్లకు సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, సిఎస్ఆర్, కార్పొరేట్ సంస్థలు, ఎన్జీఓలు, తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ సాంస్కృతిక ఉద్యమ ధ్రువతార కానూరి

**పలాస, ఏప్రిల్ 10 (వార్త):** విప్లవ సాంస్కృతిక ఉద్యమ ధ్రువతార కానూరు వెంకటేశ్వరరావు అని అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షుడు సార్ర రామారావు కొనియాడారు. చిన్న నీలావతిలో కామ్రేడ్ కానూరి 11వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కానూరు తన జీవితాంతం కళారంగానికి అంకితమయ్యాడని, విప్లవ సాంస్కృతికోద్యమ ధ్రువతారగా నిలిచారని రామారావు కొనియాడారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ కానూరు ప్రజల పక్షాన నిలిచారన్నారు. ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జుట్టు వీరాస్వామి, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంకల పాపయ్య, మురిపిండి తాతారావు, ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మగౌరవ పోరాట దినాలు పాటిద్దాం




**పలాస, ఏప్రిల్ 10 (వార్త):** పూలే జయంతి(ఏప్రిల్ 11) నుంచి అంబేద్కర్ జయంతి(ఏప్రిల్ 14) వరకు దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినా లుగా పాటిద్దామని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం పలాస రైల్వే ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాంబాబు మాట్లాడుతూ సామాజిక ఉద్యమంతో కులం లేని సమాజం కోసం తపించిన పూలే, అంబేద్కర్ జయంతులను వాడ..వాడల్లో జరిపి వారి ఆశయాలను కొన సాగించాలని కోరారు. దళిత, ఆదివాసీలకు వ్యతిరేక పాలకులను నిలదీసి రాజ్యాంగ హక్కుల అమలుకు ఉద్యమిస్తేనే పూలే, అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చినవారమవుతామన్నారు. రాష్ట్రంలో పాలకులు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఇతర పథకాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు ఆర్భాటంగా ఏర్పాటు చేశారని, వాటికీ నిధులు కేటాయించడంలో పూర్తి వైఫల్యం చెందారని, రెండేళ్లు కావస్తున్నా ఒక్క రూపాయి రుణం ఇవ్వలేని చేతకాని కూటమి ప్రభుత్వం అని విమర్శించారు. కార్యక్రమంలో హక్కుల నేత దానెసు, వీరస్వామి, ప్రకాష్, పాపారావు, బొత్స వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచులకు నేడు సన్మానం

### -వైకాపా యువజన అధ్యక్షుడు కిశోర్‌కుమార్



**మందస, ఏప్రిల్ 10(వార్త):** పలాస నియోజకవర్గంలో ఇటీవల పదవీ విరమణ చేసిన సర్పంచ్‌లు, కౌన్సిలర్లుకు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పల రాజు ఆధ్వర్యంలో ఘన సన్మానం శనివారం నిర్వహిస్తున్నామని వైసీపీ యువ జన అధ్యక్షుడు శానాపతి కిశోర్‌కుమార్ తెలిపారు. మందసలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ సర్పంచ్, కౌన్సిలర్ సతీసమేతంగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పలాసలోని ప్రగతి భవన్ వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. పలాస నియోజక ర్గ పార్టీ క్యాడర్ యావత్తు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఉమా రామలింగేశ్వర ఆలయం అభివృద్ధి



**ఇచ్ఛాపురం ఏప్రిల్ 10 (వార్త):** దాసన్నపేట మెయిన్ రోడ్డులో గల ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఆలయ అభివృద్ధి కమిటీ నడుం బిగించింది. తొలుత ధ్వజస్తంభం నిర్మాణానికి భూమి పూజ చేశారు. సుమారు మూడు లక్షల వ్యయంతో కూడుకున్న ఈ నిర్మాణానికి విశ్రాంత రైల్వే ఉద్యోగి నందిక నీలాద్రి రెడ్డి ముందుకు వచ్చారు. ఆలయ అభివృద్ధి పనులు దాతల ప్రోత్సాహంతో మొదలు పెడతామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

## కాలం చెల్లిన డ్రింక్స్ విక్రయిస్తే చర్యలు

### - ఎంపీడీవో మోహన్ కుమార్



**సారవకోట, ఏప్రిల్ 10 (వార్త):** కాలం చెల్లిన శీతలపానీయాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో మోహన్ కుమార్ హెచ్చరించారు. గురువా రం ఆయన పంచాయతీ కార్యదర్శి సింహాచలంతో కలిసి అలుదు గ్రామంలో శీతల పానీయాలు విక్రయిస్తున్న దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూల్ డ్రింక్స్ తయారీ తేదీలు, గడువు తేదీలను పరిశీలించారు. వివిధ బ్రాండ్లను తనిఖీ చేసి, షాపు యజమానులకు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి నాణ్యతలేని లేదా గడువు ముగిసిన ఉత్పత్తులను విక్రయించకూడదని స్పష్టం చేశారు.

## కాలువలు లేక రోడ్లపై మురుగు నీరు

**జలుమూరు, ఏప్రిల్ 10 (వార్త):** చల్లవానిపేట జగనన్న కాలనీలో కాలువల లేమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఈ కాలనీలో ఇప్పటికీ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇళ్లలో వాడిన మురుగు నీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. దీంతో కాలనీలో అపరిశుభ్రత పరిస్థితులు నెలకొన్నాయి. వాడుక నీరు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడడంతో రహదారులపై నీరు నిల్వ ఉండి, కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.



# ఉద్యాన పంటల సాగులో సూచనలు పాటించండి

### -ఉద్దానంలో ఉద్యానవన శాస్త్రవేత్తల బృందం పర్యటన
### -క్షేత్రస్థాయిలో జీడి, మామిడి పంటల పరిశీలన
### -తోటల్లోనే రైతులకు అవగాహన సదస్సులు
### -బాపట్ల, శ్రీకాకుళం శాస్త్రవేత్తలతో రైతుల చర్చలు



**మందస, ఏప్రిల్ 10(వార్త):** ఉద్దాన ప్రాంతంలో రైతులకు అవగాహన కల్పించడానికి ఉద్యానవన శాస్త్రవేత్తలే స్వయంగా వచ్చారు. బాపట్ల, శ్రీకాకుళం జీడి మామిడి పరిశోధనస్థానం, ఉద్యానపరిశోధన స్థానం అధికారులు పలాస మండలంలోని బొడ్డపాడు, మాకన్నపల్లి, వజ్రపుకొత్తూరులోని బైపల్లి, అక్కుపల్లి, గరుడుభద్ర, చీపురుపల్లి, మందస మండలంలోని బహడపల్లి, నల్లబొడ్లూరు, సోంపేట మండలంలోని మామిడిపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ బృందంలో డాక్టర్ డా. జి.స్రవంతి(శాస్త్రవేత్త, కీటక శాస్త్ర విభాగం, జీడిమామిడి పరిశోధనస్థానం, బాపట్ల), డాక్టర్ టి.రాజశేఖరం(తెగుళ్లు విభాగము, ఉద్యాన పరిశోధన స్థానం, పెద్దపేట, శ్రీకాకుళం), సీహెచ్ శంకరదాసు(ఉద్యాన అది కారి, పలాస), ఉద్యానవన సహాయకులు కె.వెన్నెల, డి.నీలమణిదుర్గ ఉన్నారు. ఇటీవల కాలంలో వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాలు, వడగండ్లు, పెరుగు తున్న ఉష్ణోగ్రతలతో జీడిమామిడి తోటల్లో పురుగులు, తెగుళ్లు ఉధృతి పెరగడం, జీడి పూత మాడడం, జీడి పిక్కలు నల్లగా మారడం, పిండినల్లి, తామర పురుగులు, బ్లైట్ వంటి తెగుళ్ల ఉధృతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీటి నివారణకు రైతులకు సలహాలు, సూచనలు అందించారు. పూతమాడు తెగుళ్లు(20%), పిండినల్లి(15%), తామర పురుగులు(10%)



వీటితో పాటు వెబ్బీరూ, లూపర్స్, తేయాకు దోమ గుర్తించారు. రైతులు వేపనూనె(10000పీపీఎం) 2ఎంఎల్/లీటరు నీటికి, ప్రొఫెనోపాస్ 50ఈసీ 1ఎంఎల్/ లీటరు నీటికి, శాఫ్ 2జీఎం/లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. డాక్టర్ టి.రాజశేఖరం మాట్లాడుతూ రైతులు పంట కోత తరువాత జూన్- జూలైలో అవసరం లేని కొమ్మలు తొలగించి, పచ్చి రొట్ట ఎరువులు విత్తనాలు దుక్కిలో వేసుకుని 45 రోజులు తరువాత కలియ దున్నాలన్నారు. ఎరువులు యూరియా- 1100జి, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ - 750జి, పొటాష్-250జి, పశువులు గెత్తం- 100కేజీలు వరకు కలిపి జూన్-జూలైలో ఒక భాగం, సెప్టెంబర్ - అక్టోబర్‌లో ఒక భాగం చొప్పున తగిన మోతాదులో వేసుకోవాలని సూచించారు. పిక్క మొక్క స్థానంలో అంటు మొక్కలు నాటితే త్వరగా కాపు వచ్చి చెట్టు ఒక్కింటికి 10-16కేజీ వరకు దిగుబడి రావడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల నుంచి తప్పించుకుంటుందన్నారు. పూత నుంచి పిక్కలు వచ్చే సందర్భంగా అవసరం లేకుంటే మందులు పిచికారి చేయ వద్దన్నారు. సింథటిక్ పైరిథాయిడ్లాంటి మందులు పిచికారితో మిత్రపురుగులు చనిపోయి ఫలదీకరణం/ సంపర్కం ఆగిపోయి దిగుబడులు తగ్గిపోతాయన్నారు. చిగురు, లేతపూత, లేతపిక్క దశలో జీడిమామిడి తోటలకు శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు సలహా మేరకు మందులు పిచికారి చేయాలని సూచించారు. బహువార్షిక పంటలైన జీడిమామిడి తోటలకు రసాయనిక పురుగు మందులు ఎక్కువ వాడడంతో దీర్ఘకాలంలో తోటలు సహజగుణం కోల్పోయి దిగుబడులు తగ్గిపోతాయన్నారు. జీవ సంబంధ ఎరువులు, పురుగు మందులు (వేప నూనె, వేప కషాయం, కానుగ కషాయం) వంటివి ఉపయోగించాలని శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖాధికారులు, సిబ్బంది రైతులు తెలిపారు.

# స్మార్ట్ కిచెన్ల ప్రతిపాదనను రద్దు చేయాలి




### -మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి
### - సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి డిమాండ్

**పలాస, ఏప్రిల్ 10 (వార్త):** మధ్యాహ్న భోజనం పథకంలో స్మార్ట్ కిచెన్ల ప్రతిపాదన రద్దు చేసి, కార్మికులకు ఉపాధి భద్రత కల్పించి, ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. శుక్రవారం పలాస మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఈవో సత్యంకు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కిచెన్ ప్రతిపాఎన రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ధరలకనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, వంట నిర్వహణకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సౌకర్యం, ఐడెంటిటీ కార్డులు, యూనిఫారం ఇవ్వాలని కోరారు. యూనియన్ అధ్యక్షురాలు పి.భూదేవి మాట్లాడుతూ కాంట్రాక్టర్ల లాభాల కోసం కార్మికుల ఉపాధిని కొల్లగొట్టడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ఈ విధానాన్ని విరమించి మధ్యాహ్నం భోజన పథకం బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వై.మణమ్మ, బి.శశిరేఖ, కె.మహాలక్ష్మి, కె.తులసి, జి.పుణ్యవతి, యస్.తులసి, కె.పెద్దింటమ్మ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో సంపూర్ణ విజయాన్ని కైవసం చేసుకోవాలి

### -టీడీపీ నాయకుడు గాలి కృష్ణారావు

**పలాస, ఏప్రిల్ 10 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సంపూర్ణ విజయాన్ని కైవసం చేసుకునేందుకు తెలుగుదేశం పార్టీ పక్కా వ్యూహరచనతో సిద్ధమవుతోందని, క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల నుంచి పార్టీని పటిష్టం చేయ డం, ఎమ్మెల్యే గౌతు శిరీష నాయకత్వంలో సాధించిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం అనే ద్వంద్వ వ్యూహంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణు లకు ఉన్నత నాయకత్వం దిశానిర్దేశం చేయవలసిన బాధ్యత మన అందరిపై ఉందని క్లస్టర్-2 కన్వీనర్ గాలి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గెలుపే ఏకైక లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపుని చ్చారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, సమన్వయకర్త వెంకన్న చౌదరి మార్గదర్శకత్వంలో ప్రతి వార్డులోనూ పక్కా ప్రణాళిక అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి యూనిట్, బూత్ కన్వీనర్లు తమ పరిధిలోని ఓటర్లతో మమేకమ వ్వాలని, ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వ విజయా లను వారికి వివరించాలని సూచించారు. ప్రతి వార్డులోనూ పార్టీ జెండా ఎగరేయడమే మన లక్ష్యమని, అధిష్టానం ఆదేశాలను శిరసావహించి, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని, నాయకత్వం నిర్దేశించిన కార్యక్రమా లను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడానికి అవసరమైన సమన్వయం చేసి, పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఫలాలను ప్రతి గడపకూ చేరవేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. రానున్న ఎన్నికలలో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, క్లస్టర్ కో కన్వీనర్ గురుటి సూర్యనారాయణ, మల్లిపెద్ది చిన్ని, రవిశంకర్ గుప్తా, కొరికాన శంకరరావు, సవర రాంబాబు, జోగా మల్లేశ్వం రావు, కొవ్వూరు సురేష్, ఇప్పిలి చాణిక్య, గురుటి శివ, యూనిట్ కన్వీనర్ కో కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా కోటేశ్వరరావు ఎంపిక



**జలుమూరు, ఏప్రిల్ 10 (వార్త):** అల్లాడపేట గ్రామానికి చెందిన కళ్యాణం కోటేశ్వరరావు సీజీఎల్ పరీక్షలో విజయం సాధించి ఇన్ కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. గురువారం విడుదలైన సీజీఎల్ పరీక్షా ఫలితాల్లో తనకు ఈ అవకాశం లభించినట్లు కోటేశ్వరరావు తెలిపారు. ఇటీవల రైల్వే లోకో పైలట్ ఉద్యోగాన్ని కూడా సాధించి ప్రస్తుతం శిక్షణ పొందుతున్న ఆయన, మరో ప్రతిష్ఠాత్మక ఉద్యోగం సాధించడం విశేషంగా నిలిచింది. కోటేశ్వరరావు తండ్రి సింహాచలం రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, తల్లి నీలవేణి గృహిణి. గ్రామస్థులు, స్నేహితులు అభినందించారు.



# ఘనంగా నేతాజీ విగ్రహావిష్కరణ



**- పారిశ్రామిక పెట్టుబడులకు శ్రీకాకుళం ఉత్తమ గమ్యం**

**- కూటమి నేతలు**

**శ్రీకాకుళం, ఏప్రిల్ 10(వార్త):** శ్రీకాకుళంలోని కొత్త రోడ్ జంక్షన్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఇతర శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నేతాజీ సేవలను స్మరించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతమని, పెట్టుబడిదారులు ముందుకు వచ్చి పరిశ్రమలు స్థాపించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. శ్రీకాకుళం కొత్త రోడ్‌లోని శాంతి కన్వెన్షన్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా లార్జెస్ట్ 3వ ఎడిషన్ సీఎస్ఆర్ సమ్మిట్ కాన్ఫరెన్స్ అండ్ అవార్డ్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతి థిగా పాల్గొని ప్రసంగించారు. కొత్త పరిశ్రమల స్థాపనతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, జిల్లా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమ్మిట్ ద్వారా శ్రీకాకుళాన్ని పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని పెట్టుబడిదారులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.




# భూగర్భ జల వనరుల పెంపునకు ప్రభుత్వం కృషి

**-100రోజుల పనులతో చెరువులు, కాలువల అభివృద్ధి**

**- మందసలో పర్యటించిన జలవనరుల శాఖ, కూటమి నాయకులు**



**మందస, ఏప్రిల్ 10(వార్త):** భూగర్భ జలవనరుల పెంపునకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జలవనరులశాఖాధికారులు, కూటమి నాయకులు తెలిపారు. మందస మండలంలో శుక్రవారం వారు పర్యటించి చెరువులు, కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు నీటి భద్రతకు సాగునీటి 100రోజుల పనులతో చెరువులు, కాలువలు అభివృద్ధి చేయనున్నామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకుని నీటి సంఘాల బాధ్యతతో 100 రోజులు భాగంగా సాగు, తాగు నీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా గ్రౌండ్ లెవెల్‌లో నీటి నిల్వలు ఉండాలని చర్యలు తీసుకుంటోందన్నారు. మందస మండలంలో గల మూలిపాడు ఊర చెరువు, స్లూయిస్ కాలువలు, మందస మండలంలో మేజర్ ఇరిగేషన్ సునాముది సిస్టం-1 పరిధిలోగల సొండిపూడిలో గుడియాట్యాంక్ ఇంకా కొన్ని చెరువులు, దేశబట్టి, బైరిసారంగపురం పితాతొలి గ్రామ చెరువులు కాలువలు, మందసలో గల కొన్ని కాలువలు, చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో మందస మండల అభివృద్ధి అధికారి, కమిటీ చైర్మన్ వై.వెంకట రమణ, ఇరిగేషన్ డీఈ సత్యప్రసాద్, ఇరిగేషన్ ఏఈ ఎస్.వి.శ్రీనివాసరావు, సునాముది సిస్టం1 చైర్మన్ రట్టి లింగరాజు, మూలిపాడు మాజీ సర్పంచ్ కొండపల్లి నారాయణరావు, ఐటీడీపీ నాయకుడు తమ్మినేని ధనుంజయ, నీటి సంఘం వైస్ చైర్మన్ కోనారి సింహాద్రి, కడమటి పూర్ణ, ఆయా సచివాలయం పరిధిలో గల అసిస్టెంట్ ఇంజనీర్స్, రైతులు పాల్గొన్నారు.

# వైసీపీ బలోపేతానికి సమష్టి కృషి

**కొత్తూరు, ఏప్రిల్ 10 (వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన చింతాడ సూర్యనారాయణ మాజీ ఎమ్మెల్యే, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతిని ఆమె క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన నియామకంపై సంతోషం వ్యక్తం చేస్తూ, ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటూ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసి, 2029 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి సంపూర్ణ శక్తితో కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తూరు ఆనందరావు, హిరమండలం మండల కన్వీనర్లు మీసాల రామకృష్ణ, మాజీ సర్పంచులు యర్లంకి ధర్మారావు, సాధుబాబు, వెంకటరావు, నాగేంద్ర, తీర్లంగి కృష్ణ మోహన్ పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారావు, పోలయ్య మాస్టారు, రాజులు నాయుడు, గిరి, మురపాక శంకర్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు.. సూర్యనారా యణకు అభినందనలు తెలిపారు. నాయకులందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపునకు బాటలు వేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.




## విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

**-మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్**



**మందస, ఏప్రిల్ 10(వార్త):** విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్ధేశించుకోవా లని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. మందసలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికల ప్రకారం చదువుకోగలిగితే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోగలుగుతార న్నారు. చెడు అలవాట్లు, వ్యవసానాల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. తోటి విద్యార్థులను గౌరవించాలని, ర్యాగింగ్ నేరమన్నారు. ప్రస్తుతం చట్టాలు కఠి నంగా ఉన్నాయని, వీటిని తెలుసుకోవాలని కోరారు. చట్టాలు, సమాజం తెలుసుకోవాలని, మంచి మార్గాన్ని ఎంచుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలను తెలిపారు. బాల్య వివాహాలు వద్దని, విద్య, భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వేదికలను ఉపయోగించే సమయంలో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దన్నారు. అనుమానాస్పద లింకులు, కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండా లని సూచించారు. కార్యక్రమంలో పీసీ కె.ఢిల్లేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బబుల్ సాహు, అధ్యాపకులు గురుగుబెల్లి రమణమూర్తి, సోమేశ్వరరావు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నివగాంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**కొత్తూరు, ఏప్రిల్ 10(వార్త):** పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దిశానిర్దేశంలో నివగాంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రోడ్లకు కొత్తూరు మండల టీడీపీ ఉపాధ్యక్షుడు బిల్లింగి సంజీవరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలు, పల్లెలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తూరు మండల టీడీపీ యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బురాడ రాకేష్ కుమార్, బూరాడ కమల హాసన్, సుంకు ప్రసాద్, బిల్లింగ్ కృష్ణ, మాజీ సర్పంచ్ టంకాల రమణారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాడ రాజు, అల్లాడ రాజు, తూత రాజు, వార్డు మాజీ సభ్యులు బురాడ సుందర్ నారాయణ, ఇరింజల కృష్ణ, లోపింటి చిన్నారావు, నాయకులు గడ్డం గోవిందరావు, గోవాలో సోమేశ్, బూర్జి సుందరరావు, బూర్జి శ్రీనివాస్, అగతమూడి సంతోష్, కుమార్ రామకృష్ణ, ధూళి రంగా, తవితయ్య, శంకర్, రాడా సన్యాసి, మిన్నారావు, అనంతం, నివగాం గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మంచినీటి పథకం అందరికీ అందించాలి



**నరసన్నపేట, ఏప్రిల్ 10 (వార్త):** గొట్టిపల్లి పంచాయతీలో అమలు చేస్తున్న రక్షిత మంచినీటి పథకం ద్వారా కొంతమందికే తాగునీరు అందుతుండగా, మరికొందరికి లబ్ధి చేకూరడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో బోరు ఆధారంగా సుమారు 20 వేల లీటర్ల సామర్థ్యంతో మంచి నీటి పథకం ఏర్పాటు చేసినప్పటికీ, పంచాయతీ పరిధిలోని యాతపేట తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా కావడం లేదని తెలిపారు. దీంతో ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం అన్ని వీధుల్లో కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను విస్తరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రాథమిక పాఠశాల తనిఖీ

**నరసన్నపేట, ఏప్రిల్ 10 (వార్త):** రెడ్డికిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఉప్పాడ శాంతారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలించిన ఆయన, సమయపాలనను కచ్చితంగా పాటించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం సమ్మేటివ్ అసెస్మెంట్-2కు సంబంధించిన పాఠ్యపుస్తకాలను పరిశీలించి, విద్యార్థులకు బోధన ఎలా జరుగుతోందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా బోధన కొనసాగించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.



# ప్రజా దర్బార్‌లో సమస్యలు విన్న ఎమ్మెల్యే

**పోలాకి, ఏప్రిల్ 10 (వార్త):** కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నరసన్నపేట శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఆయన ఓపిగ్గా విన్నారు. పింఛన్లు, భూ సమస్యలు, ఇల్లు స్థలాలు, గృహ నిర్మాణాలు, సిమెంట్ రోడ్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించగా, మిగిలిన వాటిని సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు భరోసా కల్పిస్తూ వారికి సమాధానాలు ఇచ్చి పంపించారు.



## ఒడిశా నుంచి ఆంధ్రాకు సారా సరఫరా

**-ముగ్గురిపై కేసు నమోదు -ఇద్దరి అరెస్టు**



**సోంపేట, ఏప్రిల్ 10 (వార్త):** ఒడిస్సా నుంచి ఆంధ్రాలోకి సారా సరఫరా చేస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు సోంపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీవీ రమణ తెలిపారు. ఒడిశా నుంచి రెండు కావుళ్లతో సారా రవాణా చేస్తుండగా ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా రాష్ట్రం తుమ్మగడ గ్రామానికి చెందిన భాస్కర్ కార్జీ, కృష్ణ సబర్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజులపాటు రిమాండ్ విధించారు. వీరిద్దరి వాంగ్మూలం ఆధారంగా కంచిలి మండలం దులసాయి గ్రామానికి చెందిన చైతన్య బుయ్య మీద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## వివాహ వేడుకలో తెలుగు యువత నేత దాసునాయుడు



**సారవకోట, ఏప్రిల్ 10 (వార్త):** ఆలదులో శుక్రవారం నిర్వహించిన వెలమల శ్రీనివాసరావు కుమారుడి వివాహ వేడుకకు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం అక్కడికి విచ్చేసిన అభిమానులు, బంధువులు, పార్టీ కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమం సంతోషకర వాతావరణంలో జరిగింది.

## జనాభా లెక్కలను అంకితభావంతో సేకరించాలి



లి తహసిల్దార్ రమేష్ కుమార్

**కంచిలి, ఏప్రిల్ 10(వార్త):** జనాభా లెక్కల సేకరణకు నియమించిన ఎన్యూమరేటర్లు అంకితభావంతో పనిచేయాలని తహసీల్దార్ రమేష్ కుమార్ సూచించారు. కంచిలిలో జరుగుతున్న రెండవ రోజు శిక్షణ తరగతులకు ఆయన హాజరై ఎన్యూమరేటర్లకు పలు విషయాలను సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన డేటా సేకరణ విషయంలో ఎటువంటి అశ్రద్ధకు అవకాశం లేకుండా చిత్తశుద్ధితో విషయ సేకరణ నిర్వహించాలని కోరారు. దీని ఆధారంగా భవిష్యత్తులో సామాజిక అభివృద్ధిచ, వివిధ సామాజిక వర్గాల సంక్షేమం మొదలైన అనేక విషయాలు ఆధారపడి ఉంటాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం రూపొందించే అభివృద్ధి పథకాలు అర్హులైన అందరికీ చేరాలంటే తాజాగా సేకరించే జనగణన సమాచారమే ఎంతో కీలకమైనదన్నారు. కార్యక్రమంలో శిక్షకులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌పై అవగాహన

**జలుమూరు, ఏప్రిల్ 10 (వార్త):** యలమంచిలిలోని ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌లో శక్తి యాప్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టెక్కలి డివిజన్ శక్తి టీంకు చెందిన హెడ్ కానిస్టేబుల్లు ఎం.గిరిధర్, కె.గణేశ్ విద్యార్థులకు శక్తి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. స్మార్ట్ మొబైల్‌లో శక్తి యాప్ ఉంటే పోలీస్ రక్షణ ఉన్నట్లేనని వారు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల రవాణా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# మంత్రి వస్తేనే సెంట్రల్ లైటింగ్ ప్రారంభమా?

**-ట్రయల్ రన్ నిర్వహించి నెల కావస్తున్నా ఇంకా చీకట్లో నే!**

**-మున్సిపల్ పదవీకాలం ముగిసిన తర్వాత జిగేల్ లు**

**-సొంత మార్కు కోసం టీడీపీ ప్రయత్నాలు**



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 10 (వార్త):** ఎన్నో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మున్సిపల్ ప్రజల ఆకాంక్ష మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం ముగిసిన



తర్వాత తీరింది. కౌన్సిల్ పాలకవర్గం గడువు ముగిసిన చివరి రోజు సెంట్రల్ లైటింగ్ వెలుగులు జిగేల్ మన్నాయి. రూ.48 లక్షల సుడా నిధులతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. ఎన్నో అడ్డంకులు దాటుకుని ఎట్టకేలకు టెస్ట్ డ్రైవ్ నిర్వహించారు. త్వరలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ప్రారంభింప చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో సెంట్రల్ లైటింగ్ వెలుగులు విరజిమ్ముతాయి. పిలక పోలారావు చైర్మన్‌గా ఉన్న సమ యంలో అప్పటి కలెక్టర్ విజయానంద్ సూచనతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టినప్పటికి కొద్దిరోజులకే మూలన పడ్డాయి. అనంతరం పిలక రాజ్యలక్ష్మి మొదటి పాలకవర్గం హయాంలో సెంట్రల్ లైటింగ్ కోసం గుజరాత్ వరకు వెళ్లి వివాదాలు మూట గట్టుకున్నారు. ప్రస్తుత హయాంలోనైనా లైటింగ్ పనులు వేగవంతం చేయాలని ప్రయత్నాలు చేసినా చివరి రోజు వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 3 దశాబ్దాల కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలక వర్గాలు వల్ల కానిది తమ ప్రభుత్వం వచ్చాక చేసి చూపించాం అనే ప్రయత్నం లో టీడీపీ ఉంది. ట్రయల్ రన్ నిర్వహించి నెల కావస్తున్నా ఇంకా ప్రారంభించ డానికి ఏర్పాట్లు చేయలేదు. దీంతో అటు చిమ్మ చీకట్లు ఇటు వీధి కుక్కలు స్వైర విహారంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రారంభం చేయాలని స్థానికులు కోరుతున్నారు. సుడా చైర్మన్ కూడా ఈ పనులు పర్యవేక్షించారు. ఇప్పటికైనా వీలైనంత త్వరగా లైటింగ్ ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని కోరారు.

# ప్రకృతి వ్యవసాయం చేద్దాం..ఆరోగ్యంగా జీవిద్దాం..!




**సోంపేట, ఏప్రిల్ 10 (వార్త):** ప్రతి ఒక్కరం ప్రకృతి వ్యవసాయం చేద్దామని, తద్వారా అందరం ఆరోగ్యంగా జీవిద్దామని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. పలాసపురం యూనిట్ బారువాలో శుక్రవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఘనజీవామృతం, విత్తన గుళికల తయారీపై అవగా హన కల్పించారు. ఘనజీవామృతం పొలానికి ఎంతో మేలు చేస్తుందని పంటలు దిగుబడి పెంచడంలో క్రియాశీలకంగా పనిచేస్తుందని వివరించారు. అలాగే వివిధ రకాల పంటలకు సంబంధించిన విత్తనాలను విత్తన గుళికలుగా తయారు చేయడాన్ని ప్రత్యక్షంగా రైతులకు వివరించారు. సకాలంలో వర్షాలు లేక వర్షాభావ పరిస్థితుల్లో పంటను కాపాడుకునేందుకు విత్తన గుళికలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. సుమారు 45 రోజుల వరకు పంటను ఈ పద్ధతిలో సక్రమంగా కాపాడుకోవచ్చని తెలిపారు. విత్తన గుళికలు తయారీని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు.కార్యక్రమంలో ఎఫ్ఎమ్టీ కుమారి, కృష్ణవేణి, తిరుమల, స్వాతి, శ్రావణి, మహేష్, జయలక్ష్మి హైమావతి, దేవమ్మ పలువురు రైతులు పాల్గొన్నారు.





## వైభవంగా పొదిలాపు..గొర్లె వారి

# బారసాల వేడుక

**శ్రీకాకుళం, ఏప్రిల్ 10 (వార్త):** పీఆర్‌టీయూ కోటబొమ్మాళి మండల అధ్యక్షుడు గొర్లె మహేశ్వరరావు మనవడి బారసాల మహోత్సవం ఇటీవల వైభవంగా శ్రీకాకుళంలోని సాయిశేషాద్రి కల్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ఆయన ఏకైక తనయ హారిక తనయుడికి ఝాస్విన్‌గా నామకరణం చేశారు. ఈ ఉత్సవానికి అతిరథమహారథులు, బంధుమిత్రులు హాజరై, ఆ చిన్నారిని ఆశీర్వదించారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546